సాక్షి
అనకాపల్లి
బుధవారం । 4 । జనవరి । 2023



ఇక అటవీశాఖ కమర్షియల్ నర్సరీలు

8లో

కమర్షియల్ నర్సరీల ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మొదటిగా నర్సీపట్నంలో ఏర్పాటు చేయనున్నారు.



రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

8లో

బేస్‌బాల్ పోటీల్లో జిల్లాలో విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

వాతావరణం

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి తెలిపారు. ఉష్ణోగ్రతలు 28.4 నుంచి 28.5 డిగ్రీలు. గాలిలో తేమశాతం 80 నుంచి 82. గాలి గంటకు 4 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

జోనల్ కమిషనర్ల బదిలీ

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ పరిధిలో గల పలువురు జోనల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మంగళవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జోన్-1(భీమిలి) జోనల్ కమిషనర్ ఎస్.వి.రమణను జోన్-7(అనకాపల్లి జోన్)కు, జోన్-2(మధురవాడ) జోనల్ కమిషనర్ కె.రామును జోన్-1(భీమిలి)కు, జోన్-7 జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మిని జోన్-2కు, జోన్-4(సూర్యాబాగ్) జోనల్ కమిషనర్ కె.చక్రవర్తిని డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా, డీపీవోగా విధులు నిర్వహిస్తున్న శివప్రసాద్‌ను జోన్-4 జోనల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జోన్-3(ఆశీల్‌మెట్ట) జోనల్ కమిషనర్‌గా విజయలక్ష్మి, జోన్-5(జ్ఞానాపురం) జోనల్ కమిషనర్‌గా ఆర్‌జీవీ కృష్ణ, జోన్-6(గాజువాక) జోనల్ కమిషనర్‌గా పి.సింహాచలం అదే స్థానంలో కొనసాగనున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వద్దు

- ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో సత్యనారాయణ



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో సత్యనారాయణ

చోడవరం: కాలేజీల్లో మౌలిక సదుపాయల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దని ఇంటర్మీడియట్ బోర్డు రీజినల్ పర్యవేక్షణాధికారి ఆర్.సత్యనారాయణ తెలిపారు. ప్రైవేటు కాలేజీల్లో ల్యాబ్‌ల నిర్వహణ, క్లాస్‌రూమ్స్‌లో మౌలిక సదుపాయలపై మంగళవారం ఆయన తనిఖీ చేశారు. స్థానిక ఉషోదయ కాలేజీలో ఇంటర్మీడియట్ విభాగాన్ని ఆర్‌ఐవో పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే కాలేజీల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలన్నారు. ఐఐటీ, నీట్, ఎంసెట్‌ల్లో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా విద్యార్థులకు బోధించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గత ఏడాది ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జె.రమణాజీ, కరస్పాండెంట్ కృష్ణకుమారి, కాలేజీల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఏప్రిల్ 29న నవోదయ పరీక్ష

అనకాపల్లిటౌన్: నవోదయ ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 29న నిర్వహించనున్నట్టు డీఈవో లింగేశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న, 2011 మే 1 నుంచి 2013 ఏప్రిల్ 30వ తేదీ లోపు జన్మించిన విద్యార్థులు 6వ తరగతిలో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. ఈనెల 31లోగా https:// navodaya. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మిగతా వివరాల కోసం విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

నక్కపల్లి క్లస్టర్‌లో కారిడార్ పనులకు గ్రీన్‌సిగ్నల్

- ఇప్పటికే ప్రారంభం
- స్టార్టప్ ఏరియా కోసం 1,120 ఎకరాలు సిద్ధం
- మౌలిక వసతుల కల్పనకు రూ.399 కోట్లు కేటాయింపు



సబ్ స్టేషన్ ఏర్పాటు చేసే ప్రాంతంలో నిర్మిస్తున్న ప్రహరీ

నక్కపల్లి: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ రీజియన్ (వీసీఐసీఆర్)నిర్మాణానికి ప్రభుత్వం శరవేగంగా చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలోని నక్కపల్లి క్లస్టర్‌లో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటుకు గతంలో బీజం పడింది. నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో పరిశ్రమల స్థాపన కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తాజాగా ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ప్రత్యేక ఆర్థికమండలి (ఎస్ఈజెడ్-సెజ్) కోసం స్టార్టప్ ఏరియా కింద 1120 ఎకరాలు సిద్ధం చేసినట్టు అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంతో ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఇటీవల రూ.399 కోట్లు కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. దీంతో ఈ స్టార్టప్ ఏరియాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో ప్రభుత్వం నక్కపల్లిని క్లస్టర్‌గా చేర్చింది. 2010లో భూసేకరణ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫేజ్ 1లో 2,246.98 ఎకరాల జిరాయితీ, 1,679.73 ఎకరాల ప్రభుత్వ భూములను సేకరించింది. వీటిలో జిరాయితీ, డి ఫారం పట్టా, ప్రభుత్వ భూములతో పాటు, రైతుల ఆక్రమణలో ఉన్న భూములు కూడా ఉన్నాయి. ఈ విధంగా నక్కపల్లి మండలం చందనాడలో 847 ఎకరాల జిరాయితీ, 462 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వేంపాడులో 308 ఎకరాల జిరాయితీ, 410 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. డీఎల్ పురంలో 428 ఎకరాల జిరాయితీ, 414 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. రాజయ్యపేటలో 663 ఎకరాల జిరాయతీ, 221 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇవికాక ఎస్.నర్సాపురంలో 9 ఎకరాలు, బుచ్చిరాజుపేటలో 161 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించింది. భూములిచ్చిన రైతులందరికీ నష్టపరిహారం, చెట్లు, నిర్మాణాలకు సైతం పరిహారం చెల్లించింది. ఇలా రైతుల నుంచి సేకరించిన సుమారు నాలుగు వేల ఎకరాల భూముల్లో సెజ్ ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ సెజ్‌లో పరిశ్రమలు స్థాపించేందుకు పలువురు పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపిస్తున్నారు. పరిశ్రమలు స్థాపించేందుకు కావాల్సిన మౌలిక సదుపాయల కోసం 1120 ఎకరాలను స్టార్టప్ ఏరియా కింద గుర్తించింది. రాజయ్యపేటలో 29.66 ఎకరాలు, బుచ్చిరాజుపేటలో 5.98 ఎకరాలు, చందనాడలో 754.36 ఎకరాలు, వేంపాడులో 269.78 ఎకరాలు, డీఎల్‌పురంలో60.22 ఎకరాలు సిద్ధం చేసింది. ఈ స్టార్టప్ ఏరియాలో ముందుగా మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వాడుకనీరు, విద్యుత్ సదుపాయాలు కల్పిస్తారు. వీటికోసం ప్రభుత్వం మొదటి విడతగా ఇటీవల రూ.399 కోట్లు కేటాయించింది. అలాగే రోడ్డు కనెక్టివిటీ కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రధాన జాతీయ రహదారి నుంచి సెజ్ భూముల వరకు రెండు లేదా నాలుగు లేన్ల రోడ్లు నిర్మించాల్సి ఉంటుంది.



ఏపీఐఐసీ సేకరించిన భూముల ప్లాన్‌చిత్రం



రేబాక నుంచి అమలాపురం వరకు 133 కేవీ విద్యుత్ టవర్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

విద్యుత్ లైన్ల ఏర్పాటు

ప్రస్తుతం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో స్టార్టప్ ఏరియాలో అమలాపురం శివారు మూలపర సమీపంలో సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సబ్ స్టేషన్ కోసం రేబాక నుంచి జాతీయ రహదారి మీదుగా 133 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైను ఏర్పాటు చేస్తున్నారు. టవర్ల నిర్మాణం, హైటెన్షన్ వైర్ల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి.

కనెక్టివిటీ రోడ్డుకు భూ సేకరణ

జాతీయ రహదారి నుంచి కాగిత, పాటిమీద, తమ్మయ్యపేట, చందనాడ మీదుగా రాజయ్యపేట వరకు కనెక్టివిటీ రోడ్డు కోసం భూసేకరణ చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం కాగిత రైతుల నుంచి సుమారు 60 సెంట్లు భూమి సేకరించాల్సి ఉంది. రైతులకు రూ.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించి భూములు తీసుకునేందుకు అధికారులు చర్చలు జరుపుతున్నారు. వీసీఐసీఆర్ పనులకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేయడంతో భూసేకరణ జరిగిన నక్కపల్లి క్లస్టర్‌లో పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే నక్కపల్లి మండలంలో హెటిరో రసాయన పరిశ్రమ, పాయకరావుపేట మండలంలో దక్కన్ కెమికల్స్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మందికి ఉపాధి కలుగుతోంది. భూముల ధరలు పెరగడంతోపాటు, ఉపాధి అవకాశాలు మెరుగు పడ్డాయి. ఇక మండలంలో సెజ్ ఏర్పాటై, పరిశ్రమలు వస్తే వేలాది మందికి ఉపాధి లభించి వలసలు తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమలు రాక పెరిగింది. త్వరలో పలు భారీ పరిశ్రమలు రానున్నట్టు సమాచారం.

రూ.24 కోట్లతో జెట్టీ

రాజయ్యపేటలో ప్రభుత్వం మత్స్యకారుల కోసం రూ.24 కోట్లతో జెట్టీ (ఫిష్ ల్యాండింగ్ సెంటరు) ఏర్పాటుకు పరిపాలనా ఆమోదం తెలిపింది. కేంద్రం నుంచి అనుమతులు కూడా వచ్చాయి. ఇందుకు 6 ఎకరాలు కావాల్సి ఉంది. అధికారులు స్థలాన్ని ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు. స్థలం లభిస్తే జెట్టీ పనులు ప్రారంభమవుతాయి. మత్స్య సంపదకు మార్కెటింగ్, రవాణా, స్టోరేజ్ అవకాశం ఉంటుంది. త్వరలో కార్యనిర్వాహక రాజధాని కాబోతున్న విశాఖపట్నానికి 100 కిలోమీటర్ల దూరంలో అచ్యుతాపురం తర్వాత మరో సెజ్ నక్కపల్లి మండలంలో ఏర్పాటు కాబోతోంది. ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సబ్ స్టేషన్ పనులు ప్రారంభం

నక్కపల్లి క్లస్టర్‌లో స్టార్టప్ ఏరియా కింద 1120 ఎకరాలు సిద్ధం చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. దీని కోసం ప్రభుత్వం రూ.399 కోట్లు కేటాయించింది. రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సదుపాయం కల్పించనుంది. సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారి నుంచి కాగిత మీదుగా చందనాడ వరకు కనెక్టివిటీ రోడ్డు కోసం భూసేకరణ చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులతో ధర విషయమై చర్చలు జరుపుతున్నాం.

–అనిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఏపీఐఐసీ

2,18,531 మందికి రూ.60.96 కోట్ల పింఛన్లు



పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి, సర్పంచ్ పసుపులేటి లక్ష్మి

తుమ్మపాల: జిల్లాలో కొత్తగా మంజూరైన పింఛన్లతో కలిపి మొత్తం 2,18,531 మందికి రూ.60.96 కోట్లు పంపిణీ చేస్తున్నట్టు కలెక్టర్ రవిపట్నాన్‌శెట్టి తెలిపారు. పింఛన్ల పంపిణీ వారోత్సవాల్లో భాగంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాజమహేంద్రవరంలో మంగళవారం నిర్వహించిన సభను కలెక్టరేట్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా పెంచిన మొత్తంతో పింఛన్లను లబ్ధిదారులకు కలెక్టర్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పింఛన్‌ను రూ.2,750కి పెంచిందని తెలిపారు. జిల్లాలో ఈ నెల నుంచి 1,43,141 మంది వృద్ధులు, 60,337 మంది వితంతువులు, 5,780 మంది ఒంటరి మహిళలు, 3,265మంది మత్స్యకారులు, 2,623 మంది చేనేత కార్మికులు, 2,328 మంది కల్లుగీత కార్మికులు, 1,057 మంది చర్మకారులకు పెంచిన ఫించన్ అందజేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో 6,178 మందికి వివిధ కేటగిరిల్లో కొత్తగా పింఛన్లు మంజూరైనట్టు తెలిపారు. వీరిలో 2,903 మంది వితంతువులు, 2,178వృద్ధులు, 1,204మంది దివ్యాంగులు, 178 మంది మత్స్యకారులు, 102 కల్లుగీత కార్మికులు, 66 డప్పు కళాకారులు, 46 చర్మకారులు, 31 మంది ఒంటరి మహిళలు, 10 మంది నేత పనివారు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేకాధికారి మంజులవాణి, డీఎల్‌డీవో ఉదయశ్రీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఒంటరిగా పోటీకి జనసేన సిద్ధమా?

- సినిమాల్లో పవర్ స్టార్.. రాజకీయాల్లో ప్యాకేజీ స్టార్
- అభివృద్ధి, సంక్షేమం.. వైఎస్సార్‌సీపీ నినాదం
- నూతన పింఛన్ల పంపిణీలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి



కొత్త పింఛన్లు అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయగలిగే సత్తా జనసేనకు ఉందా, అందుకు సిద్ధమేనా.. 'సీఎం పవన్ కల్యాణ్' అనే టైటిల్‌తో ఒక సినిమా తీసుకుంటే బాగుంటుంది.. కావాలంటే దానికి ప్రొడ్యూసర్‌గా నేను బాధ్యతలు తీసుకుంటాను.. సినిమాల్లో పవర్ స్టార్.. రాజకీయాల్లో ప్యాకేజీ స్టార్‌గా, జనసేన పార్టీ ప్యాకేజీ పార్టీగా చరిత్రలో మిగిలిపోతుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో తుమ్మపాల బంగార్రాజు కల్యాణ మండపంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన కొత్త ఫించన్ల పంపిణీ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన రెండున్నర లక్షల మందికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన పింఛన్లు మంజూరు చేశారని చెప్పారు. అనకాపల్లి మండలం కోడూరు పంచాయతీ సర్వే నంబర్.1లో వంద ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు రూ.19 కోట్లతో టెండర్లు పూర్తి అయ్యాయని, సంక్రాంతి తరువాత పనులు ప్రారంభించనున్నట్టు మంత్రి పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దశలవారీ పింఛన్ మొత్తాన్ని పెంచుతామన్న ఎన్నికల హామీ మేరకు అవ్వాతాతలకు రూ.2 వేల నుంచి రూ.2,750 వరకు పెంచిన ఘనత సీఎం జగన్‌దేనని కొనియాడారు. చంద్రబాబు మాదిరి ఎన్నికల ముందు పసుపు కుంకుమ పేరిట తాయిలాలు పంచి, ఓట్లు దండుకునే దుస్థితి సీఎం జగన్‌కు లేదన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ పాలనలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరించారని చెప్పారు. 2014 ఎన్నికల్లో అధికారం చేపట్టిన చంద్రబాబు ఫ్యాక్టరీలను మూసివేసిన విషయాన్ని టీడీపీ నేతలు మరిచి పోయి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో చెరకు ఉత్పత్తి గణనీయంగా తగ్గుముఖం పడుతుండటంతో, రైతులను దృష్టిలో పెట్టుకుని సీఎం జగన్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటి వరకు రూ.లక్షా 80 వేల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ అయిందన్నారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్ర ప్రజల దీవెనలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ అందించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా మెరుగైన పాలన అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం మండలంలో కొత్తగా మంజూరైన 339 మందికి పింఛన్లను మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.చంద్రశేఖర్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీలు విల్లూరి సూర్యకుమారి, ఐతా రాము, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కార్గోలో కొత్త పుంతలు!

- ప్రైవేటు లాజిస్టిక్స్‌తోనూ ఒప్పందాలు
- సరకు రవాణాలో ఆర్టీసీ జోన్-1 జోరు
- గత ఏడాది కంటే రూ.4.15 కోట్లు పెరిగిన ఆదాయం
- అన్ని ఆదాయ మార్గాలపైనా ఆర్టీసీ అధికారుల దృష్టి
- ఏటీబీ ఏజెంట్ల వ్యవస్థ మరింత విస్తృతం



విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌లో పార్సిల్ రవాణా కేంద్రం



ఆర్టీసీ సరకు రవాణా కంటెయినర్

సాక్షి, విశాఖపట్నం: కార్గో రవాణాలో ఆర్టీసీ ఊహించిన దానికంటే ఎక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ఇప్పటికే తక్కువ సమయంలో సరకులను, పార్శిళ్లను గమ్యానికి చేరుస్తూ వినియోగదారుల ఆదరణ చూరగొంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ సేవలను మరింతగా విస్తృతం చేసే దిశగా ఆలోచన చేస్తోంది. సరకు రవాణాలో ఆర్టీసీ జోన్-1 (పూర్వ విజయనగరం జోన్) జోరు మీద ఉంది. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న ఈ జోన్‌లో 47 సరకు రవాణా వాహనాలున్నాయి. వీటిలో 17 కంటెయినర్లు, 30 డీజీటీలు (డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు) ఉన్నాయి. ప్రస్తుతం ఇవన్నీ ఒక్క రోజు కూడా ఖాళీ లేకుండా తిరుగుతున్నాయి. ఇలా రోజు రోజుకు పెరుగుతున్న కార్గో రవాణాతో వీటి సంఖ్యను పెంచాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు. మరోవైపు కొత్తగా ప్రైవేటు లాజిస్టిక్స్ (పార్సిల్) సంస్థలతోనూ ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా వీరు అడుగులు వేస్తున్నారు. ఇందుకోసం ఆయా సంస్థలకు అధీకృత ఏజెన్సీలను ఇస్తారు. ఆపై ఆ సంస్థలు బుక్ చేసిన సరకులను గాని, లేదా ఆ సంస్థలు రవాణా చేయగా మిగిలిన సరకులను గాని ఆర్టీసీ ద్వారా కూడా రవాణా చేసేలా చర్చిస్తున్నారు. బుకింగ్ చేసే వారి నుంచి ప్రైవేటు పార్సిల్ సంస్థలు వసూలు చేసే చార్జీతో ఆర్టీసీకి సంబంధం ఉండదు. ఆర్టీసీ నిర్దేశిత రవాణా చార్జీ చెల్లిస్తే చాలు గమ్యానికి చేరవేస్తారు. ప్రైవేటు పార్సిల్ సర్వీసులు సరకును గమ్యానికి చేర్చడానికి 3-4 రోజుల సమయం పడుతుంటే ఆర్టీసీ గరిష్ఠంగా 24-48 గంటల్లోపే ఆయా ప్రాంతాలకు చేరుస్తుంది. ఇలా ప్రైవేటు పార్సిల్ సంస్థల కంటే వేగంగా గమ్యాన్ని చేరుస్తుండడం తమకు కలిసొచ్చే అంశంగా ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

కొరియర్ సేవల్లో దూకుడు

ఆర్టీసీ కొరియర్ సేవలకు మరింత ఆదరణ లభిస్తోంది. పార్సిల్ కౌంటర్ నుంచి 10 కి.మీల పరిధిలో 50 కిలోల బరువు వరకు సరకు/కొరియర్ పార్శిళ్లను వినియోగదారుడు కోరుకున్న చిరునామాకు డోర్ డెలివరీ చేస్తున్నారు. వీటిలో వివిధ రకాల పార్శిళ్లతో పాటు బ్లడ్ శాంపిల్స్ డెంటల్ కిట్స్ వంటివి కూడా ఉంటున్నాయి. జోన్-1 నుంచి సిమెంట్, వైట్ సిమెంట్, హార్డ్‌వేర్, గృహావసర సరకులు, గోధుమపిండి, దుస్తులు, ఫ్లిప్‌కార్ట్ సరకులు, బిస్కెట్లు, విత్తనాలు, పుస్తకాలు, మందులు, బియ్యం, నూకలు, పాత టైర్లు వంటివి బుక్ అవుతున్నాయి. ఇంకా ఇల్లు మారాలనుకునే వారి సామగ్రి తరలింపును కూడా ఆర్టీసీ చేపట్టింది. ఇలా సరకు రవాణా ద్వారా 35 శాతం, పార్శిళ్ల ద్వారా 65 శాతం ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

ఏటీబీ ఏజెంట్ల సంఖ్య పెంపు

మరోవైపు ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణతో ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్ ఏజెంట్ల (ఏటీబీలు) వ్యవస్థను విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఈ జోన్‌లో 60 మందికి పైగా ఏటీబీ ఏజెంట్లు ఉండగా ఆ సంఖ్యను 200 వరకు పెంచనున్నారు. ఈ ఏజెంట్లకు బుకింగ్ చార్జీలో 15 శాతం కమీషన్‌గా చెల్లిస్తారు. ఏటీబీ కోసం గ్రామీణ ప్రాంతంలో రూ.1000, అర్బన్‌లో రూ.5 వేల చొప్పున తిరిగి చెల్లించే పద్ధతిలో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఏటీబీ ఏజెన్సీలతో పాటు ఇంటి సామగ్రి తరలింపు కోసం 7331147260/ 7331147261/ 9346749365 నంబర్లకు సంప్రదించాలని ఆర్టీసీ జోనల్ అధికారులు కోరుతున్నారు.

రూ.4.15 కోట్ల పెరుగుదల

కార్గో రవాణాలో ఆర్టీసీ జోన్-1 గత ఏడాదికంటే మెరుగైన ఆదాయాన్ని సాధించింది. 2021 ఏప్రిల్ నుంచి డిసెంబర్‌కు ఈ జోన్ రూ.11.37 కోట్లు ఆర్జించగా, 2022 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.15.52 కోట్లు సంపాదించింది. అంటే గత ఏడాదితో పోల్చుకుంటే రూ.4.15 కోట్ల ఆదాయం పెరిగిందన్న మాట! ఇలా 36 శాతానికి పైగా వృద్ధి కనిపించింది.

కార్గో వ్యవస్థ మరింత బలోపేతం



ఆర్టీసీ కార్గో రవాణాకు మంచి ఆదరణ లభిస్తోంది. దీంతో ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాం. ఏటీబీ ఏజెన్సీలను విస్తృతం చేస్తాం. డిమాండ్‌కు అనుగుణంగా డీజీటీలు/కంటైనర్ వాహనాలను పెంచుతాం. డీజిల్ ధరలు గణనీయంగా పెరిగినా 2018లో నిర్దేశించిన రవాణా చార్జీలే వసూలు చేస్తున్నాం. ఈ జోన్‌లో గత ఏడాదితో పోల్చుకుంటే రూ.4.5 కోట్ల కార్గో ఆదాయం పెరిగింది. ప్రైవేటు కార్గో సంస్థలకంటే వేగంగా, సురక్షితంగా సరకులు, పార్శిళ్లను డెలివరీ ఇస్తున్నాం. త్వరలో ప్రైవేటు కార్గో సంస్థలకు ఆథరైజ్డ్ ఏజెన్సీలు ఇచ్చి వారి సరకును కూడా ఆర్టీసీ ద్వారా రవాణా చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

–రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్-1

అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీలో తలపడిన బాలుర జట్టు



పోటీలో తలపడిన బాలికల జట్టు

చోడవరం రూరల్: అంతర జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు, రాష్ట్ర జట్ల ఎంపిక ప్రక్రియను మంగళవారం స్థానిక కళాశాల మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ, క్రీడా పతాకాలను జిల్లా వృత్తి విద్యా అధికారి ఆర్.సత్యనారాయణ ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ఉమ్మడి పదమూడు జిల్లాల నుంచి అండర్ 19 బాలుర, బాలికల జట్లు పోటీలకు హాజరయ్యాయి. జిల్లా వృత్తి విద్యా అధికారి సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.జె.కె.కృష్ణ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరచడం ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలను పొందే వీలుంటుందన్నారు. రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన వారు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. శాప్ డైరెక్టర్ జొన్నాడ శ్రీను, విశాఖ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గోతిరెడ్డి రాంబాబు, స్టేట్ అబ్జర్వర్ ఎ.ఎస్.సుధాకర్‌లు క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. తొలిరోజు బాలుర విభాగంలో ఎనిమిది మ్యాచ్‌లు, బాలికల విభాగంలో నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. బాలుర విభాగంలో అనంతపురం, తూర్పుగోదావరి జిల్లాలు రెండేసి మ్యాచ్‌ల్లో విజయం సాధించగా, శ్రీకాకుళం, విశాఖ, కృష్ణ, చిత్తూరు జట్లు ఒక్కో మ్యాచ్‌లో గెలుపొందాయి. బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, చిత్తూరు, కృష్ణ జట్లు విజయం సాధించాయి.

ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్



సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, డీఎంహెచ్‌వో హేమంత్‌లతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి మంగళవారం సందర్శించారు. ఆస్పత్రిలో వివిధ విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, డీఎంహెచ్‌వో హేమంత్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

10 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

రావికమతం: సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, 10 లీటర్లు స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్ఐ ఉమామహేశ్వరరావు మంగళవారం తెలిపారు. పిల్లవానిపాలెంలో సారా విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం అందడంతో దాడి చేసినట్టు చెప్పారు. మలిచెట్ల రాము అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

కుక్కల దాడిలో గేదె పెయ్యి, కోళ్లు మృతి


మృతి చెందిన గేదె పెయ్యి

రావికమతం: జెడ్.కొత్తపట్నం గ్రామంలో మంగళవారం వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. గుంపులుగుంపులుగా పశువుల పాకల్లో చొరబడ్డాయి. పెయ్యిలు, కోళ్లపై దాడి చేశాయి. కుక్కల దాడిలో ఒక గేదె పెయ్యి, రెండు కోళ్లు మృతి చెందాయి. రుత్తల పెద్ది రాజు అనే రైతుకు చెందిన గేదె పెయ్యిపై దాడి చేసి, చంపేశాయి. రుత్తల అప్పలనాయుడుకు చెందిన గేదె పెయ్యిని తీవ్రంగా గాయపరిచాయి. గాలి తాతాజీకి చెందిన రెండు కోడి పుంజులను ఎత్తుకుపోయాయి. దీంతో రైతులు నష్టపోయారు.

పందెంరాయుళ్ల అరెస్టు

ఎస్.రాయవరం: కోడి పందాల స్థావరాలపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఎస్ఐ ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం పెద ఉప్పలం గ్రామ శివారున పందాలు ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి 4 కోళ్లు, రూ.2,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పండగ నేపథ్యంలో కోడి పందాలు, పేకాట ఆడితే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్ఐ ప్రసాదరావు హెచ్చరించారు.

సాగునీటి విషయంలో రైతుల మధ్య కొట్లాట

అనకాపల్లిటౌన్: మండలంలోని మార్టూరులో సాగునీటి విషయంలో ఇద్దరు రైతుల మధ్య మంగళవారం కొట్లాట జరిగినట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు తెలిపారు. గ్రామానికి చెందిన బలిరెడ్డి సూరిబాబు, పొల్నాటి శ్రీను సాగునీటి విషయంలో గొడవపడినట్టు ఎస్ఐ చెప్పారు. శ్రీను కర్రతో దాడి చేయడంతో సూరిబాబు తీవ్రంగా గాయపడినట్టు తెలిపారు. సూరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- రామన్నపాలెంలో రూ.2.50 కోట్లతో నిర్మించిన వంతెన ప్రారంభం


హాజరైన ప్రజలు


రామన్నపాలెం వంతెన ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి

కశింకోట: గత ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీ మేరకు వంతెన నిర్మించి మాట నిలుపుకున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. మండలంలోని బయ్యవరం నుంచి రామన్నపాలెం గ్రామానికి వెళ్లే మార్గంలో కొండగెడ్డపై రూ.2.50 కోట్లతో నిర్మించిన వంతెనను ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి ప్రసంగించారు. టీడీపీ నాయకులు ఓట్లను బేరీజు వేసుకుని అభివృద్ధి పనులు చేస్తుంటారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతుందన్నారు. రామన్నపాలెం వంటి గ్రామానికి రూ.2.50 కోట్లతో వంతెన నిర్మించడం ప్రజల అభిమానం ముందు తక్కువే అన్నారు. ఎంతో అభిమానంతో తనను ఓట్లు వేసి గెలిపించారన్నారు. ‹మీరు ఓట్లు వేసి గెలిపించడం వల్లే తాను ఉన్నత స్థాయిలో ఉన్నానని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రి పదవి ఇచ్చి గౌరవించారని› పేర్కొన్నారు. ఇంతటి అభిమానాన్ని చూపుతున్న ప్రజలను తాను మరవబోనన్నారు. పదవి రావడానికి కారణమైన ప్రజల ఆదరాభిమానాలు ముఖ్యమని, తమ నియోజకవర్గాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామ సమస్యలు తెలుసుకుని సేవలందించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారన్నారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని ప్రజలను కోరారు. ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలన్నారు. మంత్రి అమర్‌నాథ్ ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి జరగడానికి సహకారం అందించాలన్నారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు


కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


కొత్త పింఛన్‌దారులు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అధికంగా పింఛన్ల మంజూరు
- 1,368 మందికి కొత్త పింఛన్ల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు టీడీపీ హయాంలో ఎన్ని పథకాలు ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రశ్నించారు. మంగళవారం చోడవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో 1,368 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా గురువులుతో కలిసి ప్రభుత్వ విప్ ధర్మశ్రీ వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ధర్మశ్రీ మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం రూ. 2 వేలు పింఛన్‌ను ఏటా పెంచుకుంటూ పోతామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఆ మాట ప్రకారం మూడేళ్లలో ఏటా రూ. 250 చొప్పున పెంచుతూ ప్రస్తుతం రూ. 2,750 పింఛన్ ఇస్తున్నామన్నారు. అవ్వాతాతల ఆనందమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అభాగ్యులకు అండగా ఉండాలన్న సీఎం ఆశయం వారి జీవితాల్లో నూతనుత్తేజాన్ని నింపామన్నారు. పింఛన్ల కోసం మాట్లాడే అర్హత తెలుగుదేశం పార్టీ నాయకులకు లేదన్నారు. ఎన్నికల ముందు పప్పు బెల్లాలు పంచి ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని, తర్వాత వాటిని విస్మరించే సంస్కృతి చంద్రబాబుదని దుయ్యబట్టారు. ఏకైక సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆర్నెల్లకోసారి కొత్త పింఛన్లు ఇస్తున్నారన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా లబ్ధిదారుని ఇంటికే తెల్లారేసరికి అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 68 లక్షల మంది పింఛన్‌దారులకు రూ.1,850కోట్లు ప్రతి నెలా ఇస్తున్నామన్నారు. నాలుగు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీడీవోలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, కొత్త పింఛన్‌దారులు పాల్గొన్నారు.

ఇక అటవీశాఖ కమర్షియల్ నర్సరీలు

- పైలెట్ ప్రాజెక్టుగా నర్సీపట్నం డివిజన్


కమర్షియల్ నర్సరీలో పెంచేందుకు సిద్ధం చేసిన పూల మొక్కలు

నర్సీపట్నం: ఆదాయ వనరుల పెంపుదలతో పాటు ప్రజలకు అటవీశాఖ సేవలను మరింత విస్తృతం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అటవీశాఖ నర్సరీల్లో కొన్ని రకాల మొక్కలే లభిస్తాయని, అదే ప్రైవేట్ నర్సరీల్లో అన్ని రకాలూ లభిస్తాయన్న పరిస్థితి నుంచి బయటపడేందుకు అధికారులు కమర్షియల్ నర్సరీలపై దృష్టిసారించారు. దశల వారీగా జిల్లాలో వీటిని అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో సోషల్ ఫారెస్టు అధికారులు కార్యాచరణ రూపొందించారు. పండ్లు, పూలు, అలంకరణ సంబంధించిన పొడవైన, పొట్టి జాతుల మొక్కలను వృద్ధి చేయనున్నారు. కమర్షియల్ నర్సరీ ఏర్పాటుకు నర్సీపట్నాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. నర్సీపట్నం అటవీ డివిజన్ పరిధిలోని నర్సీపట్నం కలప డిపోలో కమర్షియల్ నర్సరీని ఏర్పాటు చేసేందుకు సోషల్ ఫారెస్టు అధికారులు స్థల పరిశీలన చేశారు. భూమిని చదును చేసి, మొక్కల సంరక్షణకు అవసరమైన నీటి కోసం మోటర్లను సిద్ధం చేశారు. జిల్లాలో సోషల్ ఫారెస్టు ఆధ్వర్యంలో 41 నర్సరీలు నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా ఏటా లక్షలాది మొక్కలను సంరక్షించి రైతులు, ప్రజలకు ఉచితంగానే పంపిణీ చేస్తున్నారు. వీటితో పాటు కమర్షియల్ నర్సరీలను అందుబాటులోకి తీసుకురానున్నారు. పండ్ల మొక్కలు, నీలగిరి, సరుగుడు, మునగ, కరివేపాకు, కొబ్బరి, జామ తదితర మొక్కలను కమర్షియల్ నర్సరీల్లో పెంచి ప్రైవేట్ నర్సరీల కంటే తక్కువ ధరకే ప్రజలకు విక్రయించేందుకు ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దశల వారీగా జిల్లా వ్యాప్తంగా కమర్షియల్ నర్సరీలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఆదాయ వనరుల పెంపుదలే లక్ష్యం



ఒకప్పుడు అటవీశాఖ ద్వారా ప్రజలకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేసేవారం. మారుతున్న పరిస్థితుల్లో ప్రజల్లో మొక్కల పెంపకంపై ఆసక్తి, సంరక్షణ బాధ్యత పెంచే ఉద్దేశ్యంతో వాణిజ్యపరమైన నర్సరీలను ఏర్పాటు చేస్తున్నాం. తొలిదశలో నర్సీపట్నం డివిజన్‌లో నర్సరీని నెలకొల్పుతున్నాం. పూల, పండ్ల మొక్కలతో పాటు అలంకరణ మొక్కలను అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

– కె.లక్ష్మణ్, సోషల్ ఫారెస్టు జిల్లా అధికారి

కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత


రాముకు పింఛన్ అందిస్తున్న వంశీకృష్ణ

రావికమతం: విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న తంగేటి రాముకు గ్రామ వలంటీర్ వంశీకృష్ణ మంగళవారం పింఛన్ అందించాడు. మండలంలోని గర్నికంలో తన పరిధిలోని లబ్ధిదారులందరికీ ఈ నెల 1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేశాడు. అయితే గ్రామానికి చెందిన రాము అనారోగ్యంతో కేజీహెచ్‌లో చేరినట్టు తెలుసుకుని అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అందించాడు. అతడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నాడు. వలంటీరుకు అతడి కుటుంబీకులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి

అనకాపల్లిటౌన్ : రానున్న టెన్త్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ సూచించారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో మంగళవారం రాత్రి జిల్లాలోని హైస్కూళ్ల హెచ్‌ఎంలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాటించాలన్నారు.

విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. నాడు–నేడు పనులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు, జిల్లాలోని హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మహిళ మృతి


భగీరథమ్మ ఫైల్

పాయకరావుపేట : తాండవ జంక్షన్ వద్ద బస్సు ఢీకొని భగీరథమ్మ(64) అనే మహిళ మంగళవారం మరణించింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండలంలోని కుమారపురం గ్రామం శివారు రత్నయమ్మపేటకు చెందిన ఎరిపిల్లి భగీరథమ్మ కోటనందూరులో ఎండుచేపలు అమ్ముకోవడానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో తాండవ జంక్షన్ వద్ద బస్సు ఢీ కొట్టడంతో మృతి చెందింది. మంగళవారం తెల్లవారు జామున ఈ ప్రమాదం జరిగింది. ఆమె గ్రామ పంచాయితీ 8వ వార్డు సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈమెకు ముగ్గురు పిల్లలు. భగీరథమ్మ మృతితో కుటుంబం శోక సంద్రంలో మునిగింది.

మద్యంతో పట్టుబడిన వ్యక్తి అరెస్టు

యలమంచిలి : అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై కె.పాపినాయుడు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. యలమంచిలి మండలం లైనుకొత్తూరు గ్రామానికి చెందిన వర్రి రాంబాబు అక్రమంగా మద్యం తరలిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం నిఘా వేశారు. యలమంచిలి బస్ కాంప్లెక్స్ వద్ద 4 మద్యం బాటిళ్లతో పట్టణ పోలీసులకు చిక్కాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా మద్యం తరలించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక


బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన శ్రీప్రకాష్ విద్యార్థులు

నక్కపల్లి: ఇటీవల నర్సీపట్నం మండలం వేములపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన బేస్ బాల్‌పోటీల్లో చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్– 17 విభాగంలో పదోతరగతి చదువుతున్న సాయి జ్యోతి, అండర్ 14 బాలుర విభాగంలో 8వతరగతి చదువుతున్న ఎజిత్‌అఖిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఉపాధ్యాయులు తెలిపారు. వీరిని హెచ్‌ఎం అప్పారావు, పీడీ దేముళ్లు అభినందించారు.

బేస్ బాల్ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థుల సత్తా

పాయకరావుపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిసెంబర్ 31న వేములపూడి జెడ్‌పీహెచ్ స్కూల్లో అండర్ –14, అండర్ 17 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ ఎంపికల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు సత్తా చాటారని ప్రధానోపాధ్యాయుడు డీవీ శ్రీనివాస్ తెలిపారు. అండర్ 17 విభాగంలో బి.యామిని (10 వతరగతి), కె.భువనకృతి (10వ తరగతి), అండర్–14 విభాగంలో ఆర్.లోకేష్ (8వ తరగతి), ఎల్.దిలీప్‌కుమార్ (9 వ తరగతి), కె.హరిగాయత్రి (9వ తరగతి), ఎస్.సింధు (7వ తరగతి) ఎంపికైనట్లు తెలిపారు. వీరు తరువాత కాకినాడ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విశాఖ జిల్లా తరఫున ఆడనున్నారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సంస్థ అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, కోచ్ వి.శివాజీ తదితరులు అభినందించారు.

యూకలిప్టస్ చెట్ల అక్రమ నరికివేత


నరికివేతకు గురైన యూకలిప్టస్ చెట్లు

అనకాపల్లిటౌన్ : స్థానిక మండలంలోని అక్కిరెడ్డిపాలెం పంచాయతీ వెంకటరమణపేట సర్వే నెం. 107లోని 16 ఎకరాల ప్రభుత్వ స్థలంలో యూకలిప్టస్ తోటలు సాగవుతున్నాయి. సుమారు మూడెకరాల్లో ఉన్న యూకలిప్టస్ చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు అయిదు రోజుల కిందట నరికి అమ్మేశారు. వీటి విలువ సుమారు రూ.7 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ విషయంపై గ్రామ వీఆర్వోను వివరణ కోరగా మొక్కలు నరికేసి అమ్మిన విషయం వాస్తవమేనని, ఈ విషయాన్ని తహసీల్దార్ గంగాధరరావుకు తెలిపినట్టు చెప్పారు. సుమారు ఏడేళ్ల క్రితం కొంతమంది ఈ స్థలాన్ని ఆక్రమించడంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి సదరు స్థలంలో బోర్డు పాతారు.

విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): అరకు వెళ్లే రైల్వే ప్రయాణికులు, పర్యాటకుల సౌకర్యార్థం ఈస్ట్‌కోస్ట్ రైల్వే విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె. త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ఈ నెల 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, 31, ఫిబ్రవరి 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24 తేదీల్లో బయలుదేరే విశాఖపట్నం-కిరండూల్(08551)రైలుకు, కిరండూల్‌లో ఈ నెల 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30, ఫిబ్రవరి 1, 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25 తేదీల్లో బయలుదేరే కిరండూల్-విశాఖపట్నం(08552)రైలుకు విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జత చేస్తున్నారు.

భగత్‌కి కోటి దారి మళ్లింపు

భోపాల్ డివిజన్ బినా–గుణ సెక్షన్ పరిధిలో జరుగుతున్న డబ్లింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే భగత్‌కి కోటి వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ఈ నెల 5, 12, 19 తేదీల్లో బయలుదేరే విశాఖపట్నం- భగత్ కి కోటి (18573) ఎక్స్‌ప్రెస్ వయా బినా మల్‌ఖెడి, బినా, సంత్ హిర్దరమ్ నగర్, నగడ, కోట జంక్షన్ల మీదుగా ప్రయాణిస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 7, 14 తేదీల్లో భగత్‌కి కోటి –విశాఖపట్నం(18574) వయా కోట జంక్షన్, నగడ, సంత్ హిర్దరమ్ నగర్, బినా, బినా మల్‌ఖెడి స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

సీ హారియర్ రెడీ

- రూ.7.50 కోట్లతో యుద్ధ విమాన మ్యూజియం పనులు పూర్తి
- సాగరతీరంలో అదనపు ఆకర్షణగా నిలవనున్న మ్యూజియం
- ఈ నెలలో సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు


సీ హారియర్ మ్యూజియం

దొండపర్తి (విశాఖ దక్షిణ): సుందర సాగర తీరంతో ప్రపంచ పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తున్న విశాఖ సిగలో మరికొద్ది రోజుల్లో మరో మణిహారం చేరనుంది. నౌకాదళంలో 32 ఏళ్ల పాటు సేవలందించి నిష్క్రమించిన సీ హారియర్ యుద్ధ విమానం సందర్శకులను కనువిందు చేయనుంది. రూ.7.50 కోట్లతో చేపట్టిన ఈ యుద్ధ విమాన మ్యూజియం పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ నెలలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మ్యూజియాన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సీ హారియర్ విశిష్టత

1983లో బ్రిటిష్ ఏరోస్పేస్ నుంచి కొనుగోలు చేసిన ఈ సీ హారియర్ యుద్ధ విమానం నౌకాదళం ఏవియేషన్ విభాగంలో చేరింది. గోవాలోని ఐఎన్ఎస్ హంస యుద్ధ నౌకలో 32 ఏళ్ల పాటు దేశానికి సేవలందించింది. 2016లో సేవల నుంచి నిష్క్రమించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చొరవతో వీఎంఆర్‌డీఏ ఈ యుద్ధ విమానాన్ని సాగరతీరంలో మ్యూజియంగా తీర్చిదిద్దుతోంది. సాగరతీరానికి అదనపు ఆభరణంలా ఇప్పుడు సీ హారియర్ యుద్ధ విమానం కూడా సిద్ధమవుతోంది.

రూ.7.5 కోట్లతో..

బీచ్‌రోడ్డు రాజీవ్ స్మృతి భవన్‌లో రూ.7.5 కోట్లతో ఈ సీ హారియర్ యుద్ధ విమాన మ్యూజియం పనులు చేపట్టింది. హైడ్రాలిక్ క్రేన్ సహాయంతో జీ ప్లస్ టూ బిల్డింగ్‌లో సీహారియర్‌ను వేలాడదీశారు. దీని విశిష్టతతో పాటు పర్యాటకులకు నిజమైన యుద్ధ విమానంలో ప్రయాణించే అనుభూతి కలిగేలే ఈ మ్యూజియాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో సిమ్యులేటర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అలాగే నావికాదళానికి, ఎయిర్‌క్రాఫ్ట్‌కు సంబంధించి విశేషాలతో కూడిన చిత్రాలను కూడా ప్రదర్శించనున్నారు. ఇప్పటి సాగర తీరంలో టీయూ–142 ఎయిర్‌క్రాఫ్ట్ సందర్శకులను ఎంతగానో అలరిస్తోంది. కురుసుర జలాంతర్గామి సందర్శకుల మనసు దోచుకుంటోంది. మరికొద్ది రోజుల్లోనే ఈ సీ హారియర్ మ్యూజియం కూడా అదనపు ఆకర్షణగా నిలవనుంది.

గోవా నుంచి ట్రైనింగ్ సిమ్యులేటర్

సీ హారియర్ మ్యూజియంలో వివిధ రకాల యుద్ధ విమానాల గురించి తెలుసుకునేలా సమగ్ర సమాచార ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. టీయూ–142 మ్యూజియం ముందు భాగంలో ఏర్పాటు చేసిన ఆర్చ్ మాదిరిగా సబ్‌మెరైన్ మ్యూజియాన్ని తీర్చిదిద్దనున్నారు. వీటికి తోడుగా.. ఇంటిగ్రేటెడ్ మ్యూజియంలో విభిన్న హంగులు కొత్త అనుభూతిని అందివ్వనున్నాయి. సీహారియర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను నడిపేందుకు ముందుగా శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణని నేరుగా ఎయిర్‌క్రాఫ్ట్‌లో కాకుండా దాని సిమ్యులేటర్ ద్వారా ఇవ్వనున్నారు. గోవాలోని ఐఎన్ఎస్ హంసా నేవల్‌బేస్‌లో ఉన్న ట్రైనింగ్ సిమ్యులేటర్‌ను విశాఖకు తీసుకొచ్చారు. అదే విధంగా కొచ్చి నేవల్ స్టేషన్‌లో ఉన్న విడిభాగాల్ని కూడా రప్పించారు. ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు

సీ హారియర్ మ్యూజియం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా దీన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మ్యూజియం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది. మ్యూజియాన్ని సందర్శించడంతో పాటు జ్ఞాపకాల్ని తీసుకెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– డాక్టర్ ఎ.మల్లికార్జున, కలెక్టర్, వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్

క్లుప్తంగా

6 నుంచి కశింకోటలో 'గడప గడపకు'

కశింకోట : స్థానిక 1, 4 సచివాలయాల పరిధిలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి, ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ఆయన కృషి చేస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రతులను లబ్ధిదారులకు అందించి, పథకాల అమలును పరిశీలిస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయా ప్రాంతాల్లో మంత్రి పర్యటించనున్న దృష్ట్యా సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించినట్లు వెల్లడించారు.

'దేవాంగ' క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దర్శకుడు నక్కిన త్రినాథరావు

అనకాపల్లిటౌన్ :దేవాంగ మాసపత్రిక క్యాలెండర్‌ను సినిమా డైరెక్టర్ నక్కిన త్రినాథ రావు మంగళవారం ఆవిష్కరించారు. 'ధమాకా' సినిమా ప్రచారంలో భాగంగా అనకాపల్లి విచ్చేసిన ఆయన్ను దేవాంగ ఎడిటర్ ఉప్పుగంటి సదాశివరావు కలిసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాంగ యువత మరింత ఉత్సాహంతో పనిచేసి దేవాంగ సమైక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పత్రిక పబ్లిషర్ ఉప్పుగంటి కిరణ్ కుమార్, నక్కిన సురేష్, అంకం దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాభ్యసన



తీడలో యోగాభ్యసన చేస్తున్న విద్యార్థులు

కశింకోట: మండలంలోని తీడ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా నేర్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యురాలు కె.లావణ్య అవగాహన కల్పించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఏఎన్‌ఎం జి.రజనీ కుమారి, యోగా ఇన్‌స్ట్రక్టర్ పి.సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అనకాపల్లిటౌన్ : స్థానిక నూకాంబిక ఆలయ దరి ఫైనాన్షియర్ సంక్షేమ సంఘ హాల్లో గవరపాలెం చిన హైస్కూల్ 1971-72 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, సిద్ధార్థ సోషల్ అండ్ కల్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. సహపంక్తిభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొడ్డేడ అప్పారావు, పిళ్లా శివ అప్పారావు, దాడి శివ రామకృష్ణ, రొబ్బి చంద్రరావు, కరణం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 7,145 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,600	3,940
మొదటి రకం	3,290	3,590
రెండో రకం	3,070	3,280
మూడో రకం	2,890	3,050

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
ఎస్ 5(నో ఎగ్జిట్)	-సత్యనారాయణ స్క్రీన్-1
అవతార్-2	-సత్యనారాయణ స్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
అవతార్-2	-పర్తిసాయి
టాప్‌గేర్	-వెంకటేశ్వర
లక్కీ లక్ష్మణ్ (మార్నింగ్, మేట్నీ)	
రాజయోగం (ఫస్ట్ షో, సెకండ్ షో)	- శ్రీసత్య
అవతార్-2	- రామచంద్ర

సాగులో సరికొత్త ఒరవడి..

వైఎస్సార్ పొలంబడి

పొలాలే బడులు.. గట్లే గోడలు.. రైతులే విద్యార్థులు.. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులే ఉపాధ్యాయులుగా వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా 30 మంది రైతులను పంట పొలాల వద్దే సమావేశపరచి శాస్త్రీయ సేంద్రియ వ్యవసాయం ద్వారా సాధికారత సాధించడమే దీని లక్ష్యం. ప్రధానంగా సాగు ఖర్చు తగ్గించడంతోపాటు, పంట దిగుబడి పెంచడమే ముఖ్య ఉద్దేశం.



వరిసాగులో మెలకువలు వివరిస్తున్న అధికారులు

- పంటల సాగుపై 14 వారాలపాటు శిక్షణ
- సబ్‌డివిజన్లో 40 చోట్ల పొలంబడి నిర్వహణ
- రబీలో మరో 10 చోట్ల నిర్వహణకు కార్యాచరణ

అనకాపల్లి రూరల్ : రైతును వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే కాకుండా సాగులో ఆధునిక సాంకేతికతను వినియోగించి, దిగుబడి సాధించేలా వారిని తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఖరీఫ్, రబీ సీజన్లలో పంట సాగు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు రైతులకు శిక్షణ ఇవ్వడమే దీని ప్రధాన ఉద్దేశం.

ప్రభుత్వ సహకారం

అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అనకాపల్లి, మునగపాక, కశింకోట మండలాల్లో 40 చోట్ల వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాలు నిర్వహించారు. వరి, పొద్దుతిరుగుడు వంటి పంటల సాగుపై రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను వ్యవసాయాధికారులు గ్రామాలకు వెళ్లి వివరిస్తున్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో మరో 10 చోట్ల పొలంబడి కార్యక్రమం నిర్వహించడానికి కార్యాచరణ రూపొందించారు. సంప్రదాయ పద్ధతిలోనే వ్యవసాయం చేస్తూ ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో అప్పుల పాలవుతున్న అన్నదాతలకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోంది. విత్తనాలు విత్తేనాటి నుంచి చేతికొచ్చిన పంటను విక్రయించేంత వరకూ ప్రభుత్వం రైతులకు సహకరించడం గమనార్హం.

కొన్ని పంటలకే..

ఖరీఫ్ సీజన్‌లో అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 40 పొలంబడి కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. ప్రస్తుత రబీ సీజన్‌లో మరిన్ని నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. వాటిలో వరి పంటపై అధిక శాతం పొలంబడులు నిర్వహిస్తున్నారు. తర్వాత పొద్దుతిరుగుడుకు ప్రాధాన్యతిస్తున్నారు. ఒక రైతు భరోసా కేంద్రం పరిధిలో 25 ఎకరాలకు పొలంబడి నిర్వహిస్తారు. దీనిలో 2 ఎకరాలను నమూనాగా తీసుకుని అర ఎకరంలో సమగ్ర పంటల యాజమాన్యం, ఎకరాలో కార్యాచరణ పరిశోధనలు, మరో అర ఎకరంలో రైతు ఆచరించాల్సిన పద్ధతులపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

బృందాలుగా నిర్వహణ

ఒక పొలం బడి కార్యక్రమంలో 30 మంది రైతులు పాల్గొంటారు. వీరిని ఐదు గ్రూపులుగా విభజిస్తారు. వీరంతా అన్ని అంశాలపై అవగాహన పెంచుకుని మిగిలిన రైతులకు వివరిస్తారు. పొలంబడి ప్రతీ మంగళవారం నుంచి శుక్రవారం మధ్య ముందుగా నిర్ణయించిన షెడ్యూల్‌ప్రకారం 14 వారాల పాటు ఎంపిక చేసిన గ్రామాల్లో నిర్వహిస్తారు. రోజుకు 4 నుంచి 5 గంటల వరకూ జరుగుతుంది. రైతు భరోసా కేంద్రం పరిధిలో పొలంబడిని గ్రామ వ్యవసాయ సహాయకుడు నిర్వహిస్తారు. ఆర్‌బీకేకు ఒక సీజన్‌లో ఒకటి చొప్పున సంబంధిత మండల వ్యవసాయాధికారి పర్యవేక్షణలో జరుగుతుంది. సబ్ డివిజన్ స్థాయిలో ఏడీఏ, జిల్లా స్థాయిలో జేడీఏ పర్యవేక్షిస్తారు.

సద్వినియోగపరచుకోవాలి



ప్రయోజనకరమైన పొలంబడులను రైతులు సద్వినియోగపర్చుకోవాలి. ఆరోగ్యకరమైన నాణ్యమైన పంటలు ఎలా పండించాలో రైతులు పొలంబడి ద్వారా తెలుసుకోవచ్చు. పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్లను సకాలంలో నివారించి అధిక దిగుబడులు సాధించగలుగుతారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శాస్త్రీయ మెలకువలపై రైతులకు శిక్షణ ఇస్తున్నాం. మాతోపాటు పరిశోధనా కేంద్రాలకు చెందిన సైంటిస్ట్‌లు కూడా వస్తుండడంతో శిక్షణ ద్వారా మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి.

– ఎం.రామారావు, ఏడీఏ, అనకాపల్లి

శిక్షణ బాగుంది



పంట సాగులో తలెత్తిన ఇబ్బందులను పరిష్కరించుకునేందుకు గతంలో అయితే ఎక్కడెక్కడికో వెళ్లాల్సివచ్చేది. కానీ ఇప్పుడు వ్యవసాయాధికారులంతా మా పొలాల వద్దకే వస్తున్నారు. విత్తనాల ఎంపిక, సేంద్రియ సాగు పద్ధతులు, సస్యరక్షణ చర్యలు వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. దీని ద్వారా వ్యవసాయంలో ఎక్కువ లాభాలను ఎలా పొందొచ్చో నేర్చుకుంటున్నాం.

– సుంకర కోటేశ్వరరావు, రైతు, మార్టూరు

మేనిఫెస్టో మాకు భగవద్గీత, బైబిల్, ఖురాన్

- పింఛన్ల పంపిణీలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



కొత్తగా మంజూరైన వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: తమ పార్టీ మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తామని ఐటీ, వాణిజ్యశాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక గాంధీనగరం 5వ సచివాలయంలో మంగళవారం 69 మందికి పింఛన్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా నెరవేర్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 83వవార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, జీవీఎంసీ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

80వ వార్డు పరిధిలో..

గత ప్రభుత్వంలో పెన్షన్ పొందాలంటే రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేదని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. గవరపాలెం 80వ వార్డు పరిధిలో నూతన పింఛన్‌దారులకు పెన్షన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో తెల్లారేసరికి వలంటీర్ పింఛన్ నగదుతో ప్రతి ఇంటి ముందు కనిపించడం గర్వించదగ్గ విషయన్నారు. అంతకుముందు టిడ్కో గృహాల పట్టా పాస్ పుస్తకాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ నేతలు కర్రి అప్పాజీ, కోరిబిల్లి ఆరుద్ర, కర్రి మోదునాయుడు, పెంటకోట సన్యాసి నాయుడు, పి.నాగేశ్వరరావు, పి.శివ అప్పారావు, ఎం.పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ఆనందం.. మురి'పింఛన్'!

- వేడుకగా కొత్త పింఛన్ల పంపిణీ
- మంత్రి అమర్‌నాథ్ చేతుల మీదుగా అందజేత



కశింకోటలో మంత్రి అమర్‌నాథ్ పింఛన్లు అందించాక.. ఆనందంలో కొత్త పింఛన్ లబ్ధిదారులు

కశింకోట : మండలంలో కొత్తగా పింఛన్లు మంజూరు చేసి, వాటిని అందజేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ కేటగిరీలో కొత్తగా 261 పింఛన్లు మంజూరయ్యాయి. దీంతో మంగళవారం స్థానికంగా నిర్వహించిన పింఛన్ వారోత్సవాల్లో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందించారు. లబ్ధిదారులతో వారికి అందించిన సొమ్ము రూ.2,750 పూర్తిగా వచ్చిందా, లేదా అని లెక్కించి మరీ అందించారు. ఎంతో పారదర్శకంగా పింఛన్ సొమ్ము అందిస్తున్నందుకు లబ్ధిదారులు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలిచి, ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైఎస్ ఎంపీపీలు నమ్మి మీనా, పెంటకోట జ్యోతి, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంత గొప్ప పాలన చూడలేదు



వృద్ధాప్యంలో ఉన్న నాకు పింఛన్ మంజూరైంది. రూ.2750 సొమ్ము అందజేశారు. ఈ పింఛన్ కోసం ఎవరి చుట్టూ కాళ్లరిగేలా తిరగలేదు. పైరవీలు చేయించాల్సిన అగత్యం కూడా రాలేదు. వలంటీరే వివరాలు తీసుకుని, పింఛన్ అందించారు. ఇంతకంటే గొప్ప పాలన నేనైతే చూడలేదు.

–కరణం జోగారావు, సోమవరం గ్రామం

కొండంత భరోసా



జీవితాంతం తోడుంటాడనుకున్న భర్త మధ్యలోనే దూరమయ్యాడు. ఏ ఆధారం లేని నాకు వితంతు పింఛన్ మంజూరైంది. పింఛన్ సొమ్ము కూడా అందించారు. ఇది మా కుటుంబం కొంత మేరకు సాఫీగా సాగడానికి తోడ్పడుతుంది. దీన్ని అందించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–ఊడి చిన్నమ్మలు, సుందరయ్యపేట

శ్రీనివాస కల్యాణం నేడు



స్వామివారి ఊరేగింపులో సీఐ దాడి మోహనరావు

అనకాపల్లిటౌన్: గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోట వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం పద్మావతీ అలివేలుమంగ సమేత శ్రీనివాసుని కల్యాణ వేడుకను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం స్వామి వారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ దాడి మోహనరావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నో ఒత్తిడులకు గురవుతారని, అటువంటి ఒత్తిడిని దూరం చేసేందుకు భక్తి భావం దోహదపడుతుందన్నారు.

మహిళాభ్యుదయానికి ప్రతీక సావిత్రిబాయిపూలే



సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : స్త్రీ స్వేచ్ఛ, విద్య కోసం పాటుపడిన మహనీయురాలు సావిత్రిబాయిపూలే అని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో సీమాంధ్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి 192వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయిని మొదటి ఉపాధ్యాయురాలుగా, స్త్రీ అభ్యుదయానికి పాటుపడిన మహిళగా అభివర్ణించారు. అంతకుముందు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ఉత్తరాంధ్ర జిల్లా ఇన్‌చార్జి మొల్లి రమణ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బంధం పైడిరాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జి కృష్ణంరాజు, సభ్యులు శంకర్, ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరరావు, వెంకటేష్, సంతోష్, రామకృష్ణ, బండారు సోమనాయుడు పాల్గొన్నారు. మండలంలోని మామిడిపాలెం ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు మంగళవారం జరిగాయి. పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్ సావిత్రిబాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్క్ ఇంజినీరింగ్ కళాశాలలో..

అనకాపల్లి రూరల్: స్థానిక ఆస్క్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలు ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన సావిత్రిబాయి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. భారతదేశం వెనుకబాటుకు మహిళలకు విద్య లేకపోవడమే కారణమని భావించి, మహిళా విద్య కోసం కృషి చేసిన మహనీయురాలని కొనియాడారు. బాల్య వివాహాలు, మద్యపానం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. తన భర్త పూలే చనిపోతే ఆయన చితికి భార్యగా నిప్పు పెట్టిన తొలి మహిళని పేర్కొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాలలో...

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో మంగళవారం పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్, అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు సావిత్రిబాయి పూలే స్త్రీ సమాజానికి చేసిన సేవలను వివరించారు. లింగ వివక్ష, కుల వివక్ష రూపుమాపడానికి ఆమె చేసిన పోరాటాన్ని కొనియాడారు.

అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు

- ప్రభుత్వ స్థలం లేకుంటే.. ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలు చేసి పంపిణీ
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి



రామన్నపాలెంలో సంక్షేమ పథకాల ప్రతులను లబ్ధిదారులకు అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి

కశింకోట : రామన్నపాలెం గ్రామంలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోతే ప్రైవేటు స్థలం కొనుగోలు చేసైనా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భరోసా ఇచ్చారు. మండలంలోని విసన్నపేట శివారు రామన్నపాలెంలో మంగళవారం ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అడుగడుగునా పూలు జల్లి నీరాజనాలు పలికారు. పూలమాలలు వేసి దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకుని, సంక్షేమ పథకాల బ్రోచర్లను అందించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల సమస్యను పలువురు ప్రస్తావించారు. దీంతో స్పందించిన మంత్రి ఇళ్ల స్థలాలతోపాటు ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే అసంపూర్తిగా ఉన్న రామాలయాన్ని పూర్తి చేయడానికి, గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా రూ.పది లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం, కుళాయిలను ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సామూహిక సీమంతాలు జరిపి, ఆశీస్సులందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పలకా రవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, సర్పంచ్ ఉప్పనూరి మాణిక్యం, ఎంపీటీసీ సభ్యురాలు గూడెపు లక్ష్మి, ఉప సర్పంచ్ కుండల చిలుకు, నాయకులు ఉప్పనూరి అప్పారావు, కుండల చంటి, పోతల రామారావు, నడిశెట్టి జోగినాయుడు పాల్గొన్నారు.